క్లుప్తంగా

మోదీని గద్దె దించాలి

సత్తుపల్లిటౌన్: పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి తన కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలు చేసుకుంటున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ కోరారు. సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై గురువారం నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, రాజు, సత్యనారాయణ, హమీద్, యాకూబ్, లాల్ మహ్మద్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నేడు నిరసన


మాట్లాడుతున్న మాచర్ల భారతి

తల్లాడ: కేంద్ర ప్రభుత్వ విదానాలకు నిరసనగా శుక్రవారం ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచర్ల భారతి అన్నారు. తల్లాడ దొడ్డా కృష్ణయ్య భవనంలో గురువారం పులి కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.. 22 సంవత్సరాల క్రితం పార్లమెంట్‌పై దాడి, మళ్లీ 13 తేదీన పార్లమెంట్‌లోకి నలుగురు అగంతకులు ప్రవేశించడం బీజేపీ భద్రతా వైఫల్యం వల్లేనన్నారు. మైసూర్ ఎంపీ ప్రతాప్ సింహాపై చర్య తీసుకోకుండా ప్రతిపక్షాలు పట్టు బట్టడంతో మూకుమ్మడిగా సస్పెన్స్ చేయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదినేని రమేష్, తాతా బాస్కర్‌రావు, అయినాల రామలింగేశ్వర్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, ఎస్.మోహన్‌రావు, శీలం ఫకీరమ్మ, షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వర్‌రావు, షేక్ నన్నే సాహెబ్, ముచ్చింతల చెన్నయ్య పాల్గొన్నారు.

పనివేళలు మార్చాలి


మాట్లాడుతున్న షేక్ నాగూర్ వలీ

మధిర: బీసీ గురుకుల పాఠశాలల పనివేళలు మార్చాలని, అన్ని గురుకులాలను కామన్ అడ్మినిస్ట్రేషన్ కిందకు తీసుకురావాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ తెలిపారు. మధిరలోని ఎంజేబీ బాలికల, మండల పరిధిలోని కృష్ణాపురంలో ఉన్నటువంటి టీఎస్ఆర్ఎస్ బాలుర గురుకుల పాఠశాలలను టీఎస్‌యూటీఎఫ్ మండల నాయకులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీలను తొలగించి కేర్‌టేకర్‌ను నియమించాలని, డీడీఓల అధికారాలను పాఠశాల స్థాయిలో వికేంద్రీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వినోదరావు, ఉపాధ్యక్షుడు వీరయ్య, కార్యదర్శులు ఇబ్రహీం, రాజు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, ఉపేందర్, వీరఅంజయ్య, రమేష్, జయ, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శ్రీసాయిబాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు బాబాని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఎన్ఆర్ఐ హనుమాండ్ల ఝాన్సీలక్ష్మీ – రాజేందర్‌రెడ్డి దంపతులు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పేరిట భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులున్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం

సత్తుపల్లిరూరల్: బొగ్గు గనులు, సింగరేణి కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతర పోరాటాలు చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం సత్తుపల్లి సింగరేణి క్వార్టర్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, విఠల్, ఆర్.రమణ, నాగరాజు, కె.సర్వేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రంగయ్య సేవలు మరువలేనివి

తల్లాడ: మాజీ ఎంపీపీ చల్లా రంగయ్య కడవరకు పేద ప్రజల కోసం పోరాడిన నిస్వార్థ ప్రజా నాయకుడని సీపీఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు అన్నారు. తల్లాడలో గురువారం మాజీ ఎంపీపీ చల్లా రంగయ్య దశ దిన కర్మ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. రంగయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, మస్తాన్, శ్రీనివాసరావు, వెంకటయ్య, వెంకటనరసయ్య, కేవీ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చుమీరిన పేకాట..!

- సరదాగా మొదలు.. తర్వాత బానిసగా..
- మామిడి తోటలు, ఖాళీ ప్రదేశాలే అడ్డాలు
- రూ. లక్షల్లో లావాదేవీలు
- ఛిద్రమవుతున్న కుటుంబాలు
- నిద్రావస్థలో పోలీస్ వ్యవస్థ



వైరా: మండలంలో జోరుగా పేకాట సాగుతోంది. మామిడి తోటలు, ఖాళీ ప్రదేశాలను ఎంచుకొని అక్కడ రహస్యంగా పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారు. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల వారు కూడా పేకాట ఆడుతున్నారు. పెద్ద ఎత్తున పేకాట ఆడుతుండగా, లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్లు వినిపిస్తోంది.

రోడ్డున పడుతున్న కుటుంబాలు..

- ఖానాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి రోజు కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనిది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. కూలీ పనులకు వెళ్లే మార్గమధ్యలో కొందరు పేకాట ఆడడాన్ని గమనించాడు. సరదా కోసం పేకాట ఆడడం మొదలుపెట్టాడు. మొదట రెండు రోజుల్లో అధిక మొత్తం లాభం అర్జించింది. అదునుగా భావించి వచ్చిన మొత్తాన్ని పేకాటలో పెట్టాడు. కూలీ పనులు కూడా మానేశాడు. పేకాట కోసం అప్పుల చేయడంతో తనతో పాటుగా కుటుంబం కూడా రోడ్డున పడింది.
- సిరిపురానికి చెందిన చిరు వ్యాపారి వచ్చిన ఒక్కో రూపాయిని కూడగట్టి కుటుంబ పోషణను చూసుకునేవాడు. తక్కువ మొత్తంలో అధిక ఆదాయం సంపాదించాలనే ఆశతో జూదం వైపు మళ్లి పేకాటకు బానిసయ్యాడు. కూడగట్టుకున్న మొత్తాన్ని పేకాటలో పోగొట్టుకున్నాడు. తిరిగి సంపాదించుకోవాలని తన పొలాన్ని కూడా అమ్ముకొని.. కుటుంబాన్ని రోడ్డుకు లాగాడు.
- తాటిపూడికి చెందిన ఒక యువకుడు సరదాగా పేకాట ఆడుతుండేవాడు. అది కస్తా వ్యసనంగా మారి పేకాట పందెం వరకు వెళ్లింది. దీంతో జేబులు ఖాళీ చేసుకోవడమే కాకుండా తన ఎకరం పొలాన్ని, ద్విచక్రం వాహనాన్ని సైతం తాకట్టుపెట్టి విడిపించుకోలేని స్థితిలో వదిలేయడంతో లక్షల్లో నష్టం వాటిల్లింది.
- వైరా మున్సిపాలిటీకి చెందిన పలువురు వేళాపాళ లేకుండా పేకాట ఆడుతూ ఇంటి అవసరాలు, కుటుంబ బాధ్యతలను మరిచి పేకాటకు బానిసయ్యాడు. నిత్యం జూదంలో మునుగుతూ రోజుకు రూ.లక్షల్లో గుల్ల చేసుకుంటున్నారు.

వీరందరికీ రెక్కల కష్టం పోతుందనే ఆందోళన లేదు. భార్యపిల్లలు ఏమైపోతారోనన్న బాధలేదు.. భవిష్యత్ అంధకారంలోకి నెట్టివేయబడుతోందన్న ఆవేదన అంతకన్నా లేదు.. వారికి కావాల్సింది పేకాట మాత్రమే. పేకాట గ్రామీణ, పట్టణ ప్రాంతం అనే తేడా లేకుండా అడ్డూ అదుపులేకుండా సాగుతోంది. ఉద్యోగులు, వ్యాపారులు, చిరు వ్యాపారులు, కూలీ నాలి చేసుకుని బతికే సామాన్యులు కూడా పేకాట ఆడుతూ వారి బతుకులను చిందరవందర చేసుకుంటున్నారు. దీంతో మూడు ముక్కలు.. ఆరు ఆటలుగా పల్లెలతో పాటు వైరా నియోజకవర్గ కేంద్రంలో పేకాట జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇలా సమయపాలన లేకుండా జోరుగా పేకాట నడుస్తున్న పోలీస్‌శాఖ అధికారులు తమకేమి పట్టనట్లు నిద్రావస్థలో మిన్నండిపోతున్నారు.

పేకాట అడ్డాలు..

వైరా మండలంలో.. వైరా రిజర్వాయర్ అలుగుల వైపు, గుట్ట ప్రదేశాలు, సోమవరం సోబాబు తోటలు, అదే విధంగా గన్నవరం, ఖానాపురం వంటి పలు ప్రాంతాల్లో జనసందోహం లేని మామిడి తోటలు, బడబాబుల అంపార్ట్‌మెంట్లలో ఈ పేకాట అధికంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు ఇటీవల కాలంలో పేకాట స్థావరాలపై దాడులు చేసి కేసు పెట్టిన సంఘటనలు చాలానే ఉన్నాయి.. ఒకవేళ పేకాటరాయుళ్లు పోలీసులకు దొరికిన కానీ పోలీస్‌స్టేషన్‌లో సెటిల్‌మెంట్లు చేసుకొని తప్పించుకుంటున్న సంఘటనలు లేకపోలేదు.

పట్టుబడేది సామాన్యులే..

గతంలో పేకాట స్థావరాలపై దాడులు చేసి పట్టుబడ్డ నిందితులను పరిశీలిస్తే.. ఆటోడ్రైవర్లు, చిరు వ్యాపారులు, తాపీమేస్త్రీలు, కూలీనాలి చేసుకునే పేద, మధ్యతరగతి వారే ఎక్కువ ఉండడం గమనార్హం. కాగా రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు బడాబాబుల ముసుగులో పేకాట జూదానికి పాల్పడి రూ.లక్షల్లో సొమ్ము చేసుకోవడం లేదా ఉన్నది పోగొట్టుకోవడం వంటి సంఘటనలు సైతం జరుగుతున్నట్లు మండల ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ తరుణంలో సంబంధిత అధికారులకు దొరికిన కేసులు కంటే దొరకనివి అధికంగా ఉన్నాయనే ఆపవాదు ఉంది. ఉన్నత వర్గాలు, ఉద్యోగులు ఆటకు ఉపక్రమించినప్పుడు అధికారులు ఆకస్మిక దాడులకు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కొంతమంది ఇన్‌ఫార్మర్లుగా మారి పేకాటరాయుళ్లకు ముందస్తు సమాచారం అందిస్తుండడం వల్లే ధనికులు ఎక్కువగా పట్టుబడడం లేదనే ఆరోపణలు సైతం మిన్నంటుతున్నాయి. ఏదెమైనా పేకాట వల్ల కుటుంబాలు వీధిపాలు అయ్యి ఆత్మహత్యలకు పాల్పడకముందే పోలీస్ వ్యవస్థ నిద్రావస్థలను వీడి పేకాటరాయుళ్లపై దృష్టి సారించి స్థావరాలపై ముమ్మర దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకోవాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..



పేకాటరాయుళ్లపై కేసులు నమోదు చేస్తాం. పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. అలాంటి వ్యక్తులు ఎంతటి వారైనా సరే.. వారిపై చట్టారిత్యా చర్యలు తీసుకోని కేసు నమోదు చేస్తాం.

– ఎంఏ రెహమాన్, ఏసీపీ, వైరా

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మల్లు నందిని

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని బేతనియ గాస్పెల్ చర్చిలో గురువారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖా మంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని హాజరయ్యారు. చర్చి ఫాదర్ ఆదాం ఎలీషాతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి సంఘస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నందినిని శాలువాతో ఘనంగా సన్మానించారు. పలువురు పేదలకు చీరలు పంపిణీ చేశారు. అదే విధంగా మండలంలోని బనిగండ్లపాడులోని కారుణ్య ప్రార్థనా మందిరంలో.. సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రార్థనామందిర వ్యవస్థాపకుడు, రెవరెండ్ ఎం.సైమన్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవరెండ్ ఎం.శామ్యూల్ ప్రసాద్ పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని ప్రజలకు అందించారు. అనంతరం 40 మంది పేదలకు చీరలు అందించడంతో పాటు.. చిన్నారులకు క్రిస్మస్ బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవరకొండ శిరీష, మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ప్రతాపరెడ్డి, నర్సింహారావు, శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు, రాజీవ్‌గాంధీ, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి త్రివేణి, ఇస్మాయిల్, తిరుపతమ్మ, రాజేష్, రామిరెడ్డి, పిచ్చిరెడ్డి, నాగిరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటనర్సయ్య, జానీబాషా, బాబురావు, శ్రీను, పలువురు సంఘస్తులు పాల్గొన్నారు.

24న లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో..


మాట్లాడుతున్న అలవాల కరుణాకర్

సత్తుపల్లి: ఈ నెల 24న సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించబడతాయని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ అన్నారు. గురువారం సత్తుపల్లిలోని క్రీస్తు సంఘం ప్రార్థనామందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. గౌరవ అధ్యక్షుడిగా పింగళి సామేలు, ఉపాధ్యక్షుడిగా నవకుమార్, ప్రధాన కార్యదర్శిగా థామస్, ఉప కార్యదర్శిగా దాసు, కోశాధికారిగా ఇమ్మానియేల్, రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఐ.నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ప్రభాకర్, జాన్ మార్క్, బి.వరప్రసాద్, రవికిరణ్, ప్రసన్నకుమార్, ప్రభుదాస్, రవి, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు


సత్తుపల్లిలో కేక్‌కట్ చేస్తున్న వైఎస్ జగన్ అభిమానులు


ఎర్రుపాలెం: తెల్లపాలెంలో..

సత్తుపల్లి/ఎర్రుపాలెం: ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో అభిమానులు, ఎర్రుపాలెంలోని తెల్లపాలెంలో వైఎస్సార్ టీపీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ కమల్‌పాషా, మొండెద్దు కృష్ణారెడ్డి, అర్వపల్లి సందీప్‌గౌడ్, పి.సాయిశ్రీనివాస్, తమ్మిశెట్టి గణేష్, నాగరాజు, వేణు, వంశీ, రహీం, షేక్ ఇస్మాయిల్, తిప్పాబత్తిన శౌరీలు పాల్గొన్నారు.

ఆలయంలో కాంగ్రెస్ నాయకుల పూజలు

తల్లాడ: తల్లాడకు చెందిన కాంగ్రెస్ నాయకులు అరుణాచల్ ప్రదేశ్‌లో ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి గెలుపొందితే అరుణాచల్ ప్రదేశ్‌కు వచ్చి దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తామని కోరుకున్న మొక్కును అనుమోలు కృష్ణ ఆధ్వర్యంలో వారు మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అనుమోలు కృష్ణకుమారి, సమ్మెట రామక్రిష్ణ పాల్గొన్నారు.

కాలినడకన భద్రాచలానికి..

కల్లూరురూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి ఎమ్మెల్యేగా డాక్టర్ మట్టా రాగమయి గెలిస్తే కాలనడకన భద్రాచలానికి వెళ్లి శ్రీరాముడి దర్శనం చేసుకొని మొక్కు చెల్లించుకుంటామని కల్లూరు మండలంలోని దళిత యువకులు మొక్కుకున్నారు. ఈ మేరకు చంద్రుపట్ల గ్రామం నుంచి బయలుదేరారు. బయలుదేరిన వారిలో పరిగడుపు వెంకటేశ్వర్లు, ఎర్రయ్య, ఇనుపనూరి ముత్తయ్య, గోవిందరావు, కోటి, వెంకటేశ్వర్లు, వెంకటేష్, కుటుంబరావు, నాగరాజు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాటంనేని వీరభద్రరావు, ఆళ్ల వెంకటేశ్వరావు, నర్సింహారావు, చప్పిడి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ ఉత్సవాలు జరపాలి


మాట్లాడుతున్న మదన్‌లాల్

కారేపల్లి: సింగరేణి బొగ్గుగనుల పుట్టినిల్లు అయిన సింగరేణి(కారేపల్లి) గ్రామంలో సింగరేణి ఆవిర్భావ ఉత్సవాలను జరపాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ తెలిపారు. గురువారం కారేపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవాలను సింగరేణి సంస్థ కొత్తగూడెంలో ఉన్న ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తుందని, సింగరేణి గ్రామంలో ఉత్సవాలను నిర్వహించడం యజమాన్యం విస్మరించిందన్నారు. దీంతోపాటు సింగరేణి గ్రామ అభివృద్ధిని సైతం యజమాన్యం విస్మరించిందన్నారు. తక్షణమే సింగరేణి గ్రామ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్, హన్మకొండ రమేష్, భూక్యా చందూ, షేక్ గౌసుద్దీన్, వీరూ నాయక్, కొనగండ్ల శ్రీకాంత్, బొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత భారత్ సంకల్ప యాత్ర

చింతకాని: మండలంలో శుక్రవారం నుంచి 13 రోజల పాటు వికసిత భారత్ సంకల్ప యాత్రను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పథకాలకు అర్హులైన వారిని గుర్తించటం జరుగుతుందన్నారు. మొదటి రోజు శుక్రవారం వందనం, కొదుమూరు గ్రామాల్లో, 23న రాఘవాపురం, లచ్చగూడెం, 24న నర్సింహాపురం, చింతకాని, 25న నేరడ, కోమట్లగూడెం, 26న నాగిలిగొండ, ప్రొద్దుటూరు, 27న రేపల్లెవాడ, పాతర్లపాడు, 28న నాగులవంచ రైల్వేకాలనీ, నాగులవంచ, 29న సీతంపేట, చినమండవ, 30న తిమ్మినేనిపాలెం, తిరుమలాపురం, 31న మత్కేపల్లి, జగన్నాథపురం, జనవరి 1వ తేదీన పందిళ్లపల్లి, బొప్పారం, 2న గాంధీనగర్‌కాలనీ, రామకృష్ణాపురం, 3న అనంతసాగర్, బస్వాపురం గ్రామాల్లో యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

మధిర: 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. మధిర టీవీఎం పాఠశాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై గురువారం బూత్ లెవల్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన వారు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని.. అలాగే చనిపోయిన వారికి ఫారం–7 ద్వారా తొలగించాలని, మార్పులు చేర్పుల కోసం ఫారం–8 ద్వారా సరిచేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి బూత్ లెవల్లో బూత్ అధికారులు పటిష్టమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. విదేశాల్లో ఉన్నవారు ఓటరు నమోదుకు ఫారం–6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్ కరుణాకర్, ఆర్ఐలు కృష్ణ, భానుప్రకాష్, మురళి, రాజశేఖర్, వాసు, సాయి, ఏఎల్ఎంటీ ఆర్పీలు జల్లా విశ్వనాథం, మహ్మద్ జమీర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతిగృహ విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న జ్యోతి

కల్లూరు: కల్లూరు బీసీ హాస్టల్‌లో గురువారం కల్లూరు, మధిర డివిజన్‌ల పరిధిలోని పదో తరగతి చదువుతున్న బీసీ హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ, అవగాహన తరగతులు నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎండీ మౌలాలి, రవికిరణ్, పుల్లారావులు విద్యార్థులకు ప్రేరణ అవగాహన కల్పించారు. ఈ తరగతులకు కల్లూరు, చిన్నకోరుకొండి, కిష్టారం, సత్తుపల్లి, వి.వెంకటాపురం, అడసర్లపాడు, మధిర డివిజన్‌లోని బీసీ హాస్టల్‌కు సంబంధించిన 164మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్స్ మధిర డివిజన్ అధికారి దారా నర్సయ్య, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ త్వరగా పూర్తి చేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నం చందర్

బోనకల్: రేషన్ డీలర్లు ఈ–కేవైసీని త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ పున్నం చందర్ అన్నారు. గురువారం తహసీల్‌లో ఎమ్మార్వో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల చివరి నాటికి లబ్ధిదారుల నుంచి ఈ–కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. రేషన్ కార్డులో ఉన్న లబ్ధిదారులు ఉన్నత చదువులు, ప్రైవేట్ జాబుల్లో ఉన్నవారు అక్కడ సంబంధిత రేషన్ షాపుల్లో ఈ–కేవైసీ చేయించుకునేలా లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ ఆర్ఐ లక్ష్మణ్, రేషన్ డీలర్లు తోట లింగయ్య, బందం అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

జేవీఆర్ కళాశాలలో గణిత దినోత్సవం


రామానుజం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యాన జాతీయ గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజం చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామనుజం ఖ్యాతిని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు పల్లా శ్రీనివాస్, పానెం రామచంద్రరావు, రాంబాబు, వినోద్‌కుమార్, పీర్‌సాహెబ్, మధు, విజయలక్ష్మి, సుభాషిణి, శ్రీనివాసరావు, మాధవి, చెన్నారావు, కృష్ణారావు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గణిత పుస్తకాలు అందజేత..


విద్యార్థినులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

ముదిగొండ: మండలంలోని వల్లభిలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు స్మార్ట్‌ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మురారి, జిల్లా కోఆర్డినేటర్ నిహారికలు వేదిక్ లెక్కలు పుస్తకాలు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ధర్మా, వార్డెన్ మాధురిలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలుచేయాలి



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం: ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్లుగా చేసిన పాలనకు విసిగెత్తిన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ఎన్నికల్లో సీపీఎం ఓడిపోయినా కమ్యూనిస్టు పార్టీలకు గెలుపోటములు ప్రధానం కాదని, ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయటమే కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వీరయ్య, సంజీవరావు, హనుమంతరావు, కోటేశ్వరరావు, లాలా, సురేష్, నాగుల్‌మీరా, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న కొనకళ్ల సుధారాణి

సత్తుపల్లిటౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సత్తుపల్లి సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం గుడిపాడు కాలనీ, సత్యంపేట కాలనీలలోని నిరుపేద వృద్ధులకు ట్రస్ట్ నిర్వాహకురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరు వృద్ధులను ఆదరించాలని, వృధాప్యమంటే వయస్సు మళ్లటం కాదని.. అది నిలువెత్తు అనుభవమని పేర్కొన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో..


బనిగండ్లపాడులో చీరలు అందుకున్న మహిళలతో చర్చి ఫాదర్ ఆంథోని

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో ఆర్‌సీఎం చర్చిలో గురువారం విచారణ గురువులు ఫాదర్ ఆంథోని క్రిస్మస్ పండగ సందర్భంగా 200 మంది పేద క్రైస్తవలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళికి క్రీస్తు చూపిన శాంతిమార్గం ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో సెంట్‌ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా, సిస్టర్ పుష్ప, సంఘస్తులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు దుస్తులు..

సత్తుపల్లిరూరల్: యువసేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌నగర్‌లోని పలువురు నిరుపేద మహిళలకు డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, స్వచ్ఛంద సంస్థల కో–ఆర్డినేటర్ చిత్తలూరి ప్రసాద్ గురువారం రాత్రి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జయరాజు, కేవవరెడ్డి, సాయి, వెంకి, మురళీ, శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం ప్రమాదకరం


మాట్లాడుతున్న ఇటికాల రామకృష్ణ

బోనకల్: నూతన జాతీయ విద్యా విధానం ప్రమాదకరమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం అఖిల భరత విద్యార్థి సమాఖ్య మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై జనవరి 12న పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం విద్యార్థులకు శాపంగా మారనుందన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చట్ట ప్రకారం తెలంగాణకు విద్యా సంస్థలను కేటాయించకుండా కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని.. రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, ఎస్కే నాగుల్‌మీరా, యంగల ఉజ్వల్, గిరి, సుధాకర్, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.